విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

మంగళవారం 14 మే 2024 8 పేజీలు

బారులు తీరిన ఓటర్లు

చెదురు మదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం

- ముటుకులలో గాలిలో కాల్పులు
- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- ఉదయం నుంచే క్యూలు
- రాత్రి 8 గంటల వరకు పలు కేంద్రాల్లో పోలింగ్
- దర్శిలో ఈవీఎం పగలకొట్టిన వ్యక్తిపై క్రిమినల్ కేసు
- ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్న యువతీ యువకులు
- కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్న వైసీపీ, టీడీపీ అభ్యర్థులు
- కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన కలెక్టర్, ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : చెదురు మదురు ఘటనలు మినహాయిస్తే జిల్లా వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది. తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉదయం ఏడు గంటల నుంచి ఓటర్లు పోలింగ్ బూతుల వద్ద బారులు తీరారు. గంటల తరబడి క్యూలైన్‌లో నిల్చోని వారి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఎండను సైతం లెక్కచేయలేదు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఓటింగ్ శాతం బాగా నమోదు కాగా ఎండ తీవ్రతకు 12 నుంచి 3 గంటల వరకు మందకోడిగా సాగింది. అక్కడి నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్‌శాతం ఎక్కువైంది. ఒంగోలుతో పాటు పలు పోలింగ్ బూతుల్లో క్యూలైన్‌లో ఉన్న ఓటర్ల చేత రాత్రి ఏడు గంటల వరకు కూడా వారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ సిబ్బంది అవకాశం కల్పించారు. సార్వత్రిక ఎన్నికలకు జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా ఎస్‌పి ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. అయినప్పటికీ పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో వాటి స్థానంలో కొత్త ఈవీఎంలను ఏర్పాటు చేశారు. టెక్నికల్ ప్రాబ్లం ఉన్న వాటిని వెంటనే పరిష్కరించారు. దర్శిలో ఒక యువకుడు ఈవీఎంను పగలకొట్టడగా వాటి స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేసి ఆ యువకునిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. పుల్లలచెరువు మండలం మిగతా 2 లో ...

పగిలిన తలలు..ఎరుపెక్కిన చొక్కాలు

- జిల్లాలో పలుచోట్ల దాడులు
- కర్లపాలెం మండలంలో అత్యధికంగా దాడులు చేసుకున్న వైనం
- చీరాలలో అభ్యర్థుల కారు అద్దాలు ధ్వంసం
- హింసాత్మకంగా పోలింగ్

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : సార్వత్రిక ఎన్నికల వేల బాపట్ల జిల్లాలో తలలు పగిలి తెల్ల చొక్కాలు కాస్త ఎరుపుగా మారాయి. పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ టీడీపీ నాయకులు దాడులు చేసుకున్నారు. రాళ్లు రువ్వుకుంటూ కర్రలతో దాడులు చేసుకోవటంతో తలలు పగిలి రక్తం చిందింది. బాపట్ల నియోజకవర్గంలోని కర్లపాలెం, బాపట్ల మండలంలో అత్యధికంగా దాడులు జరిగాయి. కర్లపాలెం మండలంలోని ఏట్రవారిపాలెం, బుద్దాం, నర్రావారిపాలెం, పేరలి, చింతాయపాలెం గ్రామాల్లో టీడీపీ వైకాపా శ్రేణులు బాహాబాహీకి దిగారు. ఒకరికిపై ఒకరు పిడి గుద్దులు గుద్దుకుంటూ కర్రలతో దాడి చేసుకున్నారు. అదేవిధంగా బాపట్ల మండలం పిన్ని బోయినవారిపాలెం గ్రామంలో వైకాపా టీడీపీ వర్గీయుల దాడిలో ఇరువురికి తీవ్రగాయాలైయ్యాయి. చీరాల నియోజకవర్గంలోని మిగతా 2 లో ...

వెల్లువెత్తిన చైతన్యం

- జిల్లాలో 80 శాతం మేర పోలింగ్ నమోదు
- ఎండ వానలో కూడా క్యూ కట్టిన ఓటర్లు

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : ఓటర్ల చైతన్యం వెల్లువెత్తింది. ప్రజాస్వామ్య స్ఫూర్తి ప్రజ్వరిల్లింది. పల్లె, పట్నం, వాడల జనం పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు వేసేందుకు పోటెత్తారు. గతంలో కంటే ఈ సారి ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకునేందుకు అధిక సంఖ్యలో రావటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇతర రాష్ట్రాల నుంచి వాహనాలు ఏర్పాటు చేసుకుని వచ్చి ఓటు వేయటం ప్రజాస్వామ్య స్ఫూర్తి ప్రస్ఫుటనంగా కనిపిస్తుంది. ఉదయం 7 గంటల లోపే పోలింగ్ బూత్‌ల వద్ద ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు క్యూ కట్టారు. సాయంత్రం 6గంటల వరకు కూడా క్యూలైన్లలో వందల సంఖ్యలో ఓటర్లు ఉన్నారు. జిల్లా సోమవారం వాతవారణం పలు చోట్ల ఎండ పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షం పడినా ఓటర్లు లెక్కచేయలేదు. పలుచోట్ల వివిధ పార్టీల నాయకులు దాడులు చేసుకున్నా, అభ్యర్థులపై కొంత మంది దాడులు చేసి కార్లు ధ్వసం చేసిన హింసాత్మక ఘటనలను సైతం లెక్కచేయకుండా ఓటర్లు చైతన్యంతో తమ తీర్పును నిక్షిప్తం చేశారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలు మోరాయించటంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. పలుచోట్ల చెదురుమదురు హింసాత్మక ఘటనల మధ్య సాయంత్రం 6గంటలకే పోలింగ్ సమయం ముగిసినా కొన్ని చోట్ల పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు తమ ఓటుహక్కు వినియోగించుకొనేందుకు క్యూలైన్లలో వేచి ఉన్నారు. దీంతో వీరందరికీ ఓటు వేసేందుకు ఈసీ అవకాశం కల్పించింది. సాయంత్రం 5 గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 72.14 శాతం పోలింగ్ నమోదు కాగా పలు పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ కొనసాగుతోంది. రాత్రి 10గంటల వరకు ఈ పోలింగ్ ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉన్నట్లు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు.

- ఉదయం నుంచి ఓటర్లు ఓటు వేసేందుకు క్యూ కట్టిన క్రమేపి క్యూలో ఓటర్లు పెరుగుతూనే ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా సాయంత్రం 5 గంటలకు 72.14 శాతం ఓటింగ్ నమోదైంది. అత్యధికంగా అద్దంకి నియోజకవర్గంలో పోలింగ్ శాతం నమోదు కాగా అత్యల్పంగా చీరాలలో నమోదైంది. అద్దంకిలో 76.14 శాతం, వేమూరులో 75.16 శాతం, పర్చూరులో 73.38 శాతం, రేపల్లె 71.38 శాతం, బాపట్ల 71.5 శాతం, చీరాలలో 64.53 శాతం నమోదైంది.

పగిలిన తలలు.. ఎరుపెక్కిన చొక్కాలు

(మొదటిపేజీ తరువాయి)

గవినివారిపాలెంలో టీడీపీ వైకాపా వర్గీయుల బాహాబాహీకి దిగి కర్రలతో రాళ్లతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో పలువురు వ్యక్తులకు తీవ్రగాయాలైయి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. చీరాల టీడీపీ అభ్యర్థి మాలకొండయ్య కారుపై రాళ్లు రువ్వటంతో కారు అద్దాలు పగిలాయి. అదేవిధంగా చీరాల కాంగ్రెస్ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్‌పై పేరాల పోలింగ్ కేంద్రం వద్ద దాడి చేయటంతో పాటు కారు అద్దాలు సైతం పగలగొట్టారు. మార్టూరు మండలం కోనంకి గ్రామంలో ఇరువర్గాల దాడిలో ఇరువురికి తీవ్రగాయాలైయ్యాయి. బల్లికురవ మండలం కొండాయ పాలెం గ్రామంలో వైసీపీ టీడీపీ నాయకులు పరస్పర దాడిలో ఇరువురి వ్యక్తులకు తీవ్రగాయాలైయ్యాయి. వేమూరులో సైతం ఇరుపార్టీల వర్గీయులు దాడులు చేసుకున్న సంఘటనలు చోటు చేసుకున్నాయి. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సరిపడా సిబ్బందిని నియమించకపోవటంతో కేంద్రాల వద్దే దాడులు చేసుకోవటంతో పోలీసులు సైతం చేతులెత్తేశారు. ముక్కుమ్మడిగా దాడులు చేయటంతో పలువురు తీవ్రగాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో చోటుచేసుకున్న హింసాత్మక ఘటనలు తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఘర్షణలు.. కొట్లాటల నడుమ పోలింగ్

విశాలాంధ్ర - కొల్లూరు : టీడీపీ.. వైఎస్సార్ సీపీ శ్రేణుల నడుమ ఘర్షణల నడుమ కొల్లూరు మండల పరిధిలో సార్వత్రిక ఎన్నికల పర్వం కొనసాగింది. సోమవారం నిర్వహించిన ఎన్నికల్లో ఆది నుంచి పలు పోలింగ్ బూత్‌ల వద్ద టీడీపీ, జనసేన వర్గాలు, వైఎస్సార్ సీపీ శ్రేణులకు తోపులాటలు, ఘర్షణలు చోటుచేసుకోవడంతో ఓటర్లు భయభ్రాంతులకు గురయ్యారు. కొల్లూరు బాలురోన్నత పాఠశాల వద్ద టీడీపీ వర్గాలు, వేమూరు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్ మధ్య వివాదం చోటుచేసుకోవడంతో యుద్ధవాతావరణం నెలకొంది. తొలుత తోపులాటకే పరిమితమైన వివాదం అశోక్‌బాబు తిరిగి వెళుతున్న క్రమంలో భారీ సంఖ్యలో ఆప్రాంతానికి చేరుకున్న టీడీపీ నాయులు ఆయన కారును చుట్టుముట్టారు. దీనితో ఇరు వర్గాల మధ్య వివాదం తారాస్థాయికి చేరుకుని అశోక్‌బాబు కారుపై టీడీపీ వర్గీయులు ఇటుకరాళ్లతో దాడికి పాల్పడ్డారు. దాడి ఘటనలో అశోక్‌బాబు వాహనం స్వల్పంగా ధ్వంసమైంది. అదే సమయంలో అక్కడకు చేరుకున్న పోలీసులు టీడీపీ వర్గాలను అదుపు చేసేందుకు విశ్వప్రయత్నం చేశారు. ఇరు వర్గాలను చెదర కొట్టడంతో వివాదం తీవ్రరూపం దాల్చకుండా సద్దుమణిగింది. మండలపరిధిలోని దోనేపూడి, పోతార్లంక, ఈపూరు, ఈపూరులంక, అనంతవరం గ్రామాలతోపాటు, పలు గ్రామాలలో సైతం పోలింగ్ బూత్‌ల వద్ద తిష్టవేసి ఉన్న టీడీపీ, వైఎస్సార్ సీపీ వర్గీయులు బాహాబాహికి దిగడంతో తోపులాటలు చోటు చేసుకున్నాయి. ఘర్షణలకు తోడు ఈవీఎంలు సైతం మొరాయించడం, పోలింగ్ ప్రక్రియ నిదానంగా సాగడంతో మండలంలోని పలు పోలింగ్ బూత్‌ల్లో పోలింగ్ ప్రక్రియ నత్తనడకన జరిగింది. ఓటు హక్కు వినియోగించుకునేందుకు వచ్చిన ఓటర్లకు బూత్‌ల వద్ద సరైన సౌకర్యాలు కల్పించడంలో యంత్రాంగం విఫలమవడంతో ఎర్రటి ఎండలో ఓటర్లు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మండలంలోని ఈపూరు, కొల్లూరు, దోనేపూడి, రావికంపాడు, కిష్కిందపాలెం బూత్‌ల్లో ఎన్నికల ప్రక్రియ రాత్రి వరకు కొనసాగింది. అత్యధికంగా మండలపరిధిలోని ఈపూరు పోలింగ్ బూత్‌లో ఓటింగ్ ప్రక్రియ తొమ్మిది గంటలు దాటేవరకు జరగడంతో ఓటర్లు పలు అవస్థలకు గురయ్యారు.

సమర్థవంతంగా ఉపయోగపడిన సమర్థ్ యాప్

- ఘటన స్థలాలకు క్షణాల్లో చేరుకున్న పోలీసులు
- గొడవల నివారణకు ఎంతో ఉపయోగపడ్డ యాప్
- కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షించిన ఎస్పీ వకుల్‌జిందాల్

విశాలాంధ్ర - బాపట్ల : ఎస్పీ వకుల్‌జిందాల్ ప్రతిష్టాత్మకంగా రూపొందించిన సమర్థ్‌యాప్ సార్వత్రిక ఎన్నికల రోజున ఎంతో ఉపయోగపడింది. జిల్లాలో సోమవారం జరిగిన ఎన్నికల్లో సమస్యల తలెత్తుతున్న కేంద్రం వద్దకు క్షణాల్లో సిబ్బంది చేరుకుని గొడవలు పెద్దవి కాకుండా చూశారు. సాంకేతికతను అందిపుచ్చుకొని జిల్లావ్యాప్తంగా జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను కమాండ్ కంట్రోల్ రూమ్ జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ పర్యవేక్షిస్తూ సిబ్బందిని ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సమర్థ్ యాప్ వినియోగించడం వలన కేవలం ఐదు నిమిషాల లోపు గొడవలు జరిగిన ప్రదేశాలకు పోలీస్ బలగాలు చేరుకుంటున్నాయని తెలిపారు. ఎన్నికల ప్రక్రియను జిల్లా ఎస్పీ కమాండ్ కంట్రోల్ రూమ్ నుండి పరిశీలిస్తు ఎక్కడైన అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుంటే వెంటనే సమర్థ్ మొబైల్ యాప్, కమ్యూనికేషన్ సెట్ ల ద్వారా దగ్గరలో వున్న పోలీస్ అధికారులను అప్రమత్తం చేసి వేగంగా ఘటన స్థలానికి చేరుకొని శాంతి భద్రతలను పరిరక్షించేవిధంగా ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీ చేశారు. కమ్యూనికేషన్ విభాగాన్ని, ఐటి విభాగాన్ని, సమాచార విభాగాన్ని ఒకే చోట కేంద్రీకరించి కమాండ్ కంట్రోల్ ను ఏర్పాటు చెయ్యడం వలన ఎక్కడైనా శాంతిభద్రతల సమస్యలు తలెత్తినప్పుడు క్షణాల్లోనే స్పందించి పోలీస్ బలగాలను ఘటన స్థలానికి పంపి శాంతి భద్రతలు పరిరక్షించగలుగుతున్నామని తెలిపారు. జిల్లాలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న ఎన్నికల ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా నేరుగా చూడగలుగుతున్నామన్నారు. సమర్థ్ మొబైల్ యాప్ ఎన్నికల ప్రక్రియలో ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బంది అందరు సమర్థ్ మొబైల్ యాప్ వినియోగించడం వలన వారి లైవ్ లొకేషన్‌ను ట్రాక్ చేస్తున్నామని ఏవైనా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్న సమయంలో ఆ ప్రదేశంలో విధులు నిర్వహించే పోలీసులు బటన్ నొక్కితే దగ్గరలో ఉన్న రూట్ మొబైల్ పార్టీలు, క్యూఆర్టీ, స్ట్రైకింగ్, స్పెషల్ స్ట్రైకింగ్ పార్టీల అధికారులను అప్రమత్తం చేసిన ఐదు నిమిషాల వ్యవధిలోనే ఘటన స్థలానికి చేరుకొని శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నా రన్నారు. ఎన్నికల ప్రక్రియ జరుగుతున్న సమయంలో గొడవలకు, ఘర్షణలకు పాల్పడి శాంతి భద్రతకు విఘాతం కలిగించే వారిపై చట్టపరిధిలో తీవ్రమైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో తీసుకోనే చర్యలు చాల తీవ్రంగా ఉంటాయని ఎస్పీ హెచ్చరించారు.

బారులు తీరిన ఓటర్లు

(మొదటిపేజీ తరువాయి)

ముటుకులలో వైసీపీ, తెలుగుదేశం మధ్య చోటు చేసుకున్న ఘర్షణలతో మూడు రౌండ్లు పోలీసులు గాలిలో కాల్పులు జరిపారు. అనంతరం అక్కడ పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. దర్శి మండలం బొట్లపాలెం, దేవరపాలెంలో చెదురు మదురు ఘటనలు చోటు చేసుకున్నాయి. దీంతో అక్కడ ఘర్షణ వాతావరణం ఏర్పడగా పోలీసులు రంగంలోకి దిగి ఇరువర్గాలను చెదరగొట్టారు. ఇవి మినహాయిస్తే జిల్లాలో ఎక్కడా గొడవలు జరగలేదు. పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. పోలీసులు ఎక్కడికక్కడ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. పోలింగ్ బూతుల్లో ఓటర్లకు అసౌకర్యం కలగకుండా అధికారులు తగు చర్యలు తీసుకున్నారు. గత ఎన్నికలతో పోల్చుకుంటే ఈ ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరారు. అధికారుల లెక్కల ప్రకారం సాయంత్రం ఆరు గంటల వరకు జిల్లా వ్యాప్తంగా 74.21 శాతం పోలింగ్ నమోదైంది. ఈ శాతం ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఆరుగంటల సమయం అయిన తరువాత కూడా పలు కేంద్రాల్లో క్యూలైన్‌లో ఉన్న ఓటర్ల చేత వారి ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. జిల్లా వ్యాప్తంగా జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే సంతనూతలపాడు నియోజక వర్గంలో అత్యధికంగా ఆరు గంటల వరకు అధికారిక లెక్కల ప్రకారం 79.05 శాతం, దర్శి 66.23, మార్కాపురం 75.51, గిద్దలూరు 74 శాతం, కనిగిరి 74.19 శాతం, ఒంగోలు 72.68 శాతం, యర్రగొండపాలెం 72.79 శాతం, అత్యల్పంగా కొండెపి 39.04 శాతం ఓటింగ్ నమోదైంది ఈ శాతం రాత్రి 8,9 గంటల కల్లా మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. మొత్తం మీద గతంతో పోల్చుకుంటే ఈసారి ఎన్నికల్లో కొంతమేర పోలింగ్‌శాతం పెరిగినట్లు తెలుస్తుంది. ఇక తెలుగుదేశం, వైకాపా నుంచి పోటీలో నిలిచిన అభ్యర్థులు వారి కుటుంబ సమేతంగా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కును వినియోగించు కున్నారు. వారు మాట్లాడుతూ ఎవరికివారే గెలుపు పట్ల ధీమా వ్యక్తం చేశారు. ప్రజలందరూ తమ విలువైన ఓటు హక్కును ఉపయోగించుకోవాలని కోరారు. నిన్న మొన్నటి వరకు ఎన్నికల ప్రచారంలో అలసిపోయిన అభ్యర్థులు ప్రశాంతంగా కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును ఉపయోగించుకొని అందరికీ నమస్కారం చేసుకుంటూ చిరునవ్వులతో పోలింగ్ బూత్‌ల వద్ద కన్పించారు.

ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్న యువతీ యువకులు

ఈ ఎన్నికల్లో మొట్టమొదటి సారి ఓటు హక్కు వినియోగించుకున్న యువతీ యువకులు ఉదయం ఎనిమిది గంటలకే పోలింగ్ బూతుల వద్ద క్యూలైన్‌లో నిలబడ్డారు. జిల్లా వ్యాప్తంగా మొట్టమొదటి సారి ఓటు హక్కును వినియోగించుకున్న శాతం కూడా పెరిగింది. పోలింగ్ కేంద్రాల్లో మొట్టమొదటి సారి తమ ఓటును వేయబోతున్నామన్న ఉత్సాహం, ఆనందం స్పష్టంగా కన్పిస్తుంది. మొట్టమొదటిసారి నేను నా ఓటును వేశానని సోషల్ మీడియాలో కూడా వారి ఫోటోలను షేర్ చేసి వారి ఆనందాన్ని పంచుకున్నారు. మొట్టమొదటి సారి ఓటు హక్కును వినియోగించుకుంటున్న యువతీ యువకులు ఎక్కువ మంది బెంగుళూరు, చెన్నై, వంటి నగరాల్లో ఉద్యోగాలు చేసుకుంటూ ఓటు వేసేందుకు తరలివచ్చారు.

ఓటు హక్కు ఉపయోగించుకునేందుకు ఉత్సాహం చూపిన వృద్ధులు

తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకునేందుకు 70 సంవత్సరాలు పైబడిన వృద్ధులు సైతం ఉత్సాహం చూపారు. ఎక్కడికక్కడ వీల్‌చైర్‌లో, కర్రపోటుతో, కొంతమంది మంచాల మీద, మరికొంత మంది ఇతరుల సహాయంతో తమ ఓటు హక్కు ఉపయోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్దకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆ వయసులో అనేకసార్లు ఓటు హక్కు వినియోగించు కున్నప్పటికీ ఈసారి ఎన్నికల్లో తమకిష్టమైన అభ్యర్థికి ఓటు వేయాలన్న సంకల్పంతో వృద్ధులు పోలింగ్ బూత్ వద్ద ఓటు వేసేందుకు తరలివచ్చారు. వీరిని పోలింగ్ సిబ్బంది క్యూలైన్‌లో ఉంచకుండా ప్రత్యేక మార్గంలో వీరి ఓటు హక్కు వినియోగించు కునేందుకు అవకాశం కల్పించారు. వీరి వెంట సహాయకులుగా వచ్చిన వారిని బూత్‌లో ఉన్న ఏజెంట్లు పరిశీలించారు. మొత్తం మీద వృద్ధులు సైతం ఈ ఎన్నికల్లో అత్యధిక ఓటు హక్కును నమోదు చేసుకోవడం విశేషం.

సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన ఓటర్లు

జిల్లాలో ఓటు ఉండి జీవన భృతి కోసం వివిధ ప్రాంతాల్లో జీవిస్తున్న ఓటర్లు పెద్ద ఎత్తున తమ సొంతూరుకు తరలివచ్చారు. తమ విలువైన ఓటును ఉపయోగించుకునేందుకు హైదరాబాదు, చెన్నై, బెంగుళూరు నుంచి వచ్చామని తెలుపుతున్నారు. వారిని చూస్తే ఓటుకున్న విలువ అర్థమవుతుంది. మరోపక్క వైసీపీ, తెలుగుదేశం రాజకీయ పార్టీల నేతలు కూడా ఇతర ప్రాంతాల్లో ఓటు ఉన్న వారిని ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేసి వారిని సొంతూరుకు పిలిపించారు. గతంతో పోల్చుకుంటే ఈసారి ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు అధిక సంఖ్యలో సొంతూరుకు వచ్చి ఓట్లు వేసిన సందర్భాలు కూడా జిల్లాలో అధికంగా కన్పించాయి.

కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం

అత్యంత కీలకమైన సార్వత్రిక ఎన్నిక ఘట్టాన్ని జిల్లా అధికార యంత్రాంగం సమర్థవంతంగా నిర్వహించింది. ఒకటి రెండు చోట్ల చెదురు మదురు ఘటనలు మినహాయిస్తే పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ఏ గ్రామంలో ఏ బూతులో పోలింగ్ సరళి ఎలా ఉందనే దానిని బ్రాడ్ కాస్టింగ్ ద్వారా జిల్లా కలెక్టర్ ఎప్పటికప్పుడు సమీక్షించారు. ఎక్కడా ఈవీఎంలు మొరాయించడం కాని, పనిచేయక ఇబ్బందిపడిన ఘటనలు పెద్దగా లేవు. గత సార్వత్రిక ఎన్నికలతో పోల్చుకుంటే ఈ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించారు. సమస్య, సమస్యాత్మక గ్రామాల్లో కూడా పోలీసులు ప్రత్యేక బలగాలను ఏర్పాటు చేయడంతో ఆయా గ్రామాల్లో కూడా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.

ఓటును వినియోగించుకున్న యువత

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలో ఓటు హక్కును వినియోగించుకోవడానికి యువతీ యువకులు అధిక సంఖ్యలో ముందుకు వచ్చారు. గ్రామాలలో నూతనంగా ఓటు హక్కు వచ్చిన యువతి యువకులతో కళకళ లాడాయి. తమ ఓటు హక్కును మొదటిసారిగా వినియోగించు కోవడంతో ఆనందంగా ఉందని యువతీ యువకులు తెలిపారు. ప్రజాస్వామ్య ప్రతిష్ఠతకు తమ విధిగా ఎన్ని పనులు ఉన్నా సరే ఓటు వేయడానికి ముందుకు వచ్చామని ఆనందంతో చెప్పారు.

ప్రతి పౌరుని హక్కు ఓటు

విశాలాంధ్ర-వెలిగండ్ల : ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన తమ ఓటు హక్కును స్వతంత్రంగా వినియోగించుకోవాలని సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు అన్నారు. సోమ వారం వెలిగండ్లలో అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వృద్ధులు పోలింగ్ బూతులకు రాలేని కారణంగా వారిని మూడు చక్రాల కుర్చీలో కూర్చోబెట్టి సర్పంచ్ తాతపూడి సురేష్ బాబు పోలింగ్ బూతు వద్దకి తీసుకొని వచ్చి ఓటును వేయించారు.

కార్యకర్తలను పరామర్శించిన బూచేపల్లి

విశాలాంధ్ర-దర్శి : దర్శి మండలం దేవవరం గ్రామంలో పోలింగ్ బూతుల వద్ద జరిగిన స్వల్ప వివాదములో గాయపడ్డ వైసిపి కార్యకర్తలను డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పరామర్శించారు. అధైర్య పడవద్దని మనమే గెలుస్తున్నామని సమన్వయం పాటించాలని కార్యకర్తలు ధైర్యం చెప్పారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు

విశాలాంధ్ర-టంగుటూరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టంగుటూరు మండలానికి చెందిన ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. మండలంలోని తూర్పు నాయుడుపాలెం గ్రామంలో ఎన్డీఏ కూటమి తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దూల బాల వీరాంజనేయ స్వామి పూర్తి నెంబర్ 210 తమ కుటుంబంతో పాటు కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదే గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి దామచర్ల సత్య ఓటు హక్కును వినియోగించు కున్నారు. కొండేపి మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు టంగుటూరులో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

విశాలాంధ్ర - నిజాంపట్నం : మండల వ్యాప్తంగా సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.నిజాంపట్నం మండల పరిధిలోని గ్రామాల్లో ఏర్పాటు చేసిన 54 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కావడంతో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు.ఓటర్లు తమ పోలింగ్ కేంద్రాల్లో వరుస క్రమంలో ఉండి ఎండను సైతం లెక్కచేయకుండా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎన్నికల అధికారులు వైద్య సేవలు, మంచి నీరు, తదితర సౌకర్యాలు ఏర్పాటు చేశారు.దివ్యాంగుల కోసం ప్రతి పోలింగ్ కేంద్రంలో వీల్ చైర్లు ఏర్పాటు చేశారు.ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు తీసుకున్నారు.

కనిగిరిలో ప్రశాంతంగా పోలింగ్

- ఎండ, వర్షాన్ని సైతం లెక్కచేయకుండా బారులు తీరిన ఓటర్లు
- కొన్నిచోట్ల మొరాయించిన ఈవీఎం, వీవీ ప్యాట్ మిషన్లు
- రాత్రి 7 గంటలు దాటినా క్యూ లైన్‌లో ఓటర్లు
- 74శాతం పోలింగ్ నమోదు

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 279 పోలింగ్ కేంద్రాల్లో సోమవారం సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. కనిగిరి పట్టణంతోపాటు నియోజకవర్గంలోని పలు మండలాల్లో పోలింగ్ ప్రారంభం సమయంలో మరియు పోలింగ్ ముగిసే 6 గంటల సమయంలో ఈవీఎం, వివి పేట్ మిషన్లు మురాయించాయి. మొరాయించిన మిషన్ల స్థానంలో మరొక మిషన్లను ఏర్పాటు చేయడంతో పోలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ఉదయం తీవ్రమైన ఎండను, సాయంత్రం కొద్దిపాటి వర్షాన్ని లెక్కచేయకుండా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. కనిగిరి మున్సిపాలిటీలోని 140, 141, 129,168 పోలింగ్ బూత్‌లో ఈవీఎం మిషన్లో మొరాయించటంతో గంటల తరబడి ఓటర్లు క్యూ లైన్‌లో నిలబడి ఎన్నికల అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. కనిగిరి పట్టణంలోని 136 పోలింగ్ కేంద్రంలో టిడిపి అభ్యర్థి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహ రెడ్డి తన కుమార్తె ఊహాశ్రీతో కలిసి క్యూలైన్లో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ వెలిగండ్ల మండలం నరసమందాపురం గ్రామంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు, నీటి సౌకర్యం తగినంతగా ఏర్పాటు చేయక పోవడంతో ఓటర్లు ఇబ్బందులు పడుతూ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 6 గంటల వరకు 74.19 శాతం పోలింగ్ నమోదు కాదా ఇంకా పోలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. అప్పటివరకు మొత్తం 2,40,079 ఓట్లు ఉండగా 1,78,114 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

బారులు తీరిన ఓటర్లు

విశాలాంధ్ర - మార్టూరు : సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మార్టూరులో ఓటర్లు పోటెత్తారు.గతంలో ఎన్నడూ లేనివిధంగా పోలింగ్ శాతం నమోదు అవుతున్నది. పట్టణాల్లో 85 శాతం పోలింగ్ జరుగుతుండగా గ్రామాల్లో మాత్రం 90 శాతం పైగానే పోలింగ్ జరిగింది. మధ్యలో కొద్ది సేపు వర్షం అంతరాయం కలిగించినప్పటికీ వాతావరణం చల్లబడడంతో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకొనేందుకు బారులు తీరారు. మార్టూరులో 14,27 నెంబర్ బూత్ లలో సమయం రాత్రి 7 దాటినప్పటికీ వందల సంఖ్యలో ఓటర్లు ఉండడంతో పూర్తయ్యేసరికి రాత్రి అయ్యే అవకాశం ఉంది. ఈదురు గాలులు బలంగా వీయడంతో టెంట్లు పడిపోయాయి. విద్యుత్తు అంతరాయం కలగడంతో పోలింగ్ కేంద్రాల్లో వెలుతురు లేక టార్చిలైట్లతోనూ ఫోన్ లైట్లుతోను పోలింగ్ కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది.చీకట్లో పోలింగ్ మందకొడిగా సాగింది. మండలంలోని కోనంకి గ్రామం మినహా అన్నిచోట్ల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.కోనంకి లో మాత్రం రెండు వర్గాలు ఘర్షణ పడటంతో ఉప్పలపాటి శేషగిరిరావు,సర్పంచ్ భర్త గురవయ్యలకు గాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి పోలింగ్‌కు అంతరాయం లేకుండా చేశారు. మండలంలోని నాగరాజు పల్లి గ్రామంలో నాలుగు బూత్ లలో 3200 ఓట్లు ఉండగా 2869 ఓట్లు పోలింగ్ కావడంతో 89.6 శాతం నమోదయింది. రాజుపాలెం గ్రామంలో నాలుగు బూతులలో 2436 ఓట్ల కుగాను 2226 ఓట్లు పోలింగ్ జరగడంతో 91.3 శాతం నమోదయింది.దేగరమూడి గ్రామంలో 873 ఓట్లకు గాను 811 ఓట్లు కాగా 92.8 పోలింగ్ శాతం నమోదయింది. మండల కేంద్రమైన మార్టూరులో 9వ నంబర్ కేంద్రంలో 858కుగాను 745 ఓట్లు పోలయ్యాయి. పదో నెంబర్ కేంద్రంలో 658 కుగాను 514, 11 నెంబర్ కేంద్రంలో ఐదు 565కు గాను 440 ,12 నెంబర్ బూత్ లో 661 గాను 452 ,13 నెంబర్ బూత్ లో 973 గాను 813 ,14 నెంబర్ కేంద్రంలో 1070కుగాను 900, 15 నెంబర్ బూత్ లో 704 కు గాను 564 ,16 నెంబర్ కేంద్రంలో 631కుగాను 497, 17 నెంబర్ బూత్ లో 774 గాను 568, 18 నెంబర్ కేంద్రంలో 775కుగాను 591,19 నెంబర్ కేంద్రంలో 1144 గాను 876, 20 నెంబర్ కేంద్రంలో 1001 గాను 837, 21 నెంబర్ కేంద్రంలో 818 గాను 703 ,22 నెంబర్ కేంద్రంలో 901 గాను 781,23 నెంబర్ కేంద్రంలో 893 గాను 674 ,24 నెంబర్ కేంద్రంలో 769 గాను 636, 25 నెంబర్ కేంద్రంలో 805 గాను 695, 26లో 562 గాను 461,27లో 1274 గాను 1100 ఓట్లు పోలయ్యాయి. మొత్తం మీద మార్టూరు టౌన్ లో 15836 ఓట్లు ఉండగా 13659 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ శాతం 86.2 గా నమోదయింది.కొన్ని కేంద్రాల్లో వసతులు సక్రమంగా లేకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యాయి.మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఉష్ణోగ్రత విపరీతంగా ఉండటంతో కొన్ని కేంద్రాల వద్ద టెంట్లు లేక ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. ఒకటి రెండు చెదురుముదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ఒక నిశ్శబ్దం విప్లవంలా జరిగింది.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా

3 వేల సిబ్బందితో బందోబస్తు

విశాలాంధ్ర - బాపట్ల : సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై నిఘా ఉంచి ఎన్నికలు ప్రశాంతగా జరగటమే లక్ష్యంగా సిబ్బంది పనిచేశారని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ఎస్పీ పరిశీలించారు. బాపట్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, మున్సిపల్ హై స్కూల్, సి.ఎస్.ఎన్.ఎమ్.ఏమ్ ప్రైమరీ పాఠశాల, వెదుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో స్టువర్టుపురం గ్రామంలోని ఎస్.ఏ ఎలిమెంటరీ పాఠశాల, వృక్ష నగర్ లోని ఏమ్.పి ఎలిమెంటరీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎస్పీ సందర్శించి తీసుకున్న భద్రత ఏర్పాట్లను, క్యూలైన్ల నిర్వహణ పరిశీలించి పోలింగ్ కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బందికి, రూట్ మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్, స్పెషల్ స్ట్రైకింగ్, క్యూఆర్టీ లలో విధులు నిర్వహించే పోలీసు అధికారులకు ఎన్నికల ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి తీసుకోవలసిన భద్రతాపరమైన చర్యలపై సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 1510 పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేందుకు 3,000 మందికి పైగా సిబ్బందితో అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామన్నారు. వీరిలో 9 కంపెనీల సాయుధ బలగాలు, 250 మంది తమిళనాడు పోలీసులు ఉన్నారన్నారు. ఎక్కడైనా శాంతి భద్రతల సమస్యలు తలెత్తితే వెంటనే ఆ ప్రదేశానికి, పోలింగ్ కేంద్రానికి మొబైల్ పార్టీలు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, క్విక్ రియాక్షన్ టీమ్ లు చేరుకొని శాంతిభద్రతల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఎవరైనా ఎన్నికల విధులకు గాని, ఎన్నికల ప్రక్రియకు గాని ఆటంకపరచడానికి ప్రయత్నించినా, ఘర్షణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ఎస్పీ వెంట బాపట్ల డిఎస్పి సిహెచ్. మురళీకృష్ణ, పట్టణ సిఐ యు.శ్రీనివాసులు, ఇతర పోలీసు అధికారులు ఉన్నారు.

ఓటు వేసిన అభ్యర్థులు

నర్సమాంబపురంలో వైసీపీ అభ్యర్థి నారాయణ యాదవ్

విశాలాంధ్ర-వెలిగండ్ల : ప్రతి ఓటరు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని కనిగిరి నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దంతాల నారాయణ యాదవ్ అన్నారు. సోమవారం తన స్వగ్రామమైన వెలిగండ్ల మండలం నర్సమాంబపురం బూతులో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా ఎలాంటి భయాందోళన గురికాకుండా ఓటును వేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన అన్నారు.

చీమకుర్తిలో బీఎన్.విజయకుమార్

విశాలాంధ్ర-చీమకుర్తి : ఎమ్మెల్యే అభ్యర్థి బిఎన్ విజయకుమార్ సోమవారం చీమకుర్తి గర్ల్స్ హైస్కూల్లో 26వ బూతులో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వారు మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని భావించారు. ఓటర్లు అందరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఆయన వెంట బాపట్ల నియోజకవర్గ తెలుగుదేశం ఉపాధ్యక్షులు మన్నం ప్రసాదు. చీమకుర్తి టిడిపి పట్టణ అధ్యక్షులు గొల్లపూడి సుబ్బారావు, ఎడ్లపల్లి రాంబ్రహ్మం ఉన్నారు.

కురిచేడు మండలంలో ఎన్నికలు ప్రశాంతం

విశాలాంధ్ర-కురిచేడు : సార్వత్రిక ఎన్నికలు కురిసేడు మండలంలో సోమవారం ప్రశాంతంగా జరిగాయి. కురిసేడు మండలంలో 40 బూతులు ఉన్నాయి .మండలంలో ఓటర్లు మొత్తం 32వేల 330 మంది ఉండగా అందులో పురుషులు 16,380 మంది మహిళలు 15 947 మంది ఉన్నారు సోమవారం ఉదయం 6 గంటలకు ఓటర్లు బూతులు వద్ద బారులు తీరి ఉన్నారు అధికారులు పోలింగ్ బూతులలో వివిఎంలో మాక్ పోలింగ్ వేసి చూసి తదుపరి న్యూట్రల్ చేసి ఓటింగ్ ప్రారంభించారు మండలంలో పడమట వీరాయపాలెం బూతు లో వైయస్సార్ పార్టీ కార్యకర్తలకు టిడిపి కార్యకర్తలకు గొడవ జరుగుతున్న సమయంలో పోలీసులు వచ్చి గొడవను సర్ది చెప్పారు అలాగే మండలంలో అక్కడక్కడ చిన్నపాటి గొడవలతో ముగిసి ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి మండలంలో 40 బూతులలో 30 వేల పై చిలుకలు 89% నమోదైనట్లు తెలిపారు. పడమడ వీరాయపాలెం గ్రామంలో గొడవ జరుగుతున్న సమయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బూచేపల్లి ప్రసాద్ రెడ్డి వెళ్లారు మండలంలో ప్రశాంతంగా జరిగాయి.

73.96 శాతం పోలింగ్

విశాలాంధ్ర-బేస్తవారిపేట : బేస్తవారిపేట మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 73.96 శాతం పోలింగ్ నమోదైనట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహశీల్దార్ బి. ప్రభావతి తెలిపారు. మండలంలో 41, 238 మంది ఓటర్లుండగా 30, 502 మంది తమ ఓటు హక్కును విని యోగించుకున్నట్లు ఆమె తెలిపారు. ఎక్కడా ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు.

మొరాయించిన ఈవీఎంలు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం నియోజకవర్గంలో సోమవారం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. నియోజకవర్గ పరిధిలోని ఎర్రగొండపాలెం మండలంలోని నర్సాయపాలెం గ్రామంలో కొద్దిసేపు ఇరు వర్గాల మధ్య మాటలు పెరిగి పోలింగ్ నిలిచింది. యర్రగొండపాలెం లోని 33వ పోలింగ్ బూతు, 21వ బూతు, వీరభద్రపురంలోని 6వ బూతు, పుల్ల చెరువు మండలం పిడికిటివారి పల్లెలోని 78వ బూతు, చేపలమడుగు లోని 80వ బూతు, 6 ఉమ్మడివరంలో 62వ బూతు, త్రిపురాంతకం మండలంలోని రాజుపాలెంలో 135వ బూతు, శ్రీనివాస్ నగర్ లోని 153 మూడవ బూతులో ఈవీఎంలు మొరాయించాయి. దీంతో గంట నుండి రెండు గంటల వరకు ఎన్నికల ప్రక్రియ నిలిచింది. తర్వాత తిరిగి ఈవీఎంలు పనిచేశాయి. పుల్లల చెరువు మండలంలోని శతకోడు, ముటుకుల, నరజాముల తండా, యర్రగొండపాలెం మండలం లోని వీరభద్రపురం, నరసాయపాలెం గ్రామాలలో చెదురుమదురు ఘటనల మినహా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ కు ప్రజలు 6 గంటల నుంచి ఓటు కోసం బారులు తీరారు. ఓటు వేసేందుకు వృద్ధులను సైతం యువకులు మోసుకుంటూ తీసుకొచ్చారు. దివ్యాంగులు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,07,214 మంది కాగా సాయంత్రం 6 గంటలకు 72.79 శాతం ఓట్లు పోలయ్యాయి. కాగా ఇంకా కొన్ని గ్రామాల్లో తమ ఓటు హక్కు వినియోగించు కునేందుకు క్యూలైన్లలో ఉండటంతో రాత్రి 9 నుంచి 10 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

ముగిసిన ఎన్నికలు

దేవవరం, బొట్లపాలెంలో ఇరు వర్గాల ఘర్షణ

విశాలాంధ్ర-దర్శి :
దర్శి నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ స్వల్ప వివాదాలతో ముగిసింది. దర్శి మండలంలోని బొట్లపాలెం మరియు దేవవరం గ్రామాలలో ఇరువర్గాలు ఘర్షణ పడ్డారు. పోలింగ్ కొద్దిసేపు నిలిచిపోయింది. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసుల కొరతతో అక్కడక్కడ వివాదా స్పదమైన గొడవలు జరిగాయి. బొట్లపాలెం గ్రామంలో టిడిపి అభ్యర్థి గొట్టిపాటి లక్ష్మి కార్యకర్తలను పరామర్శించేందుకు వెళ్లడంతో వైసిపి వర్గాలు అడ్డుకున్నారు. దీంతో ఆమె రోడ్డుపై బైఠాయించి నిరసన తెలియజేశారు. ఆమె వెంట మాజీ ఎమ్మెల్యే నారపుసెట్టి పాపారావు. ఆమె సోదరుడు గొట్టిపాటి భరత్‌లు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసు ఉన్నతాధికారులు స్పెషల్ ఫోర్స్ ని పంపించడంతో వివాదం సద్దుమణికి ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగింది. గ్రామీణ ప్రాంతాలలో అధిక శాతంలో ఓట్లు పోలయ్యాయి. పట్టణ ప్రాంతాలలో మధ్యాహ్నం వరకు ఓటింగ్ శాతం పూర్తిస్థాయిలో జరగగా అనంతరం మంద కోటిగా జరిగింది.128.118 బూతులలో ఎన్నికల అధికారుల నిర్లక్ష్యం కారణంగా అయినా పోలింగ్ ఆలస్యమైంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ఓటు హక్కుని వినియోగించుకున్న నేతలు

దర్శి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వైసీపీ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి. బూచేపల్లి వెంకాయమ్మ. బూచేపల్లి నందిని. లు తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. అదేవిధంగా మాజీ శాసనసభ్యులు నారపు శెట్టి పాపారావు. ఆయన సతీమణి శారద. మున్సిపల్ చైర్మన్ నారపు శెట్టి పిచ్చయ్య.. తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఎన్నికల్లో వైసీపీ ఆగడాలకు అడ్డుకట్ట

టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని నేతృత్వంలో కమిటీ

విశాలాంధ్ర - ఒంగోలు : 2024 సార్వత్రిక ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా వైసిపి సాగిస్తున్న ఆగడాలకు తెలుగుదేశం బిజెపి జనసేన ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సభ్యులు అడ్డుకట్ట వేస్తున్నారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ సూచనల మేరకు టిడిపి జిల్లా అధ్యక్షులు మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ నేతృత్వంలో జిల్లా పార్టీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాలలో వైసీపీ శ్రేణులు టిడిపి కార్యకర్తలపై చేస్తున్న దాడులు, పోలింగ్ కేంద్రాల నిర్వహణ, దొంగ ఓట్లను అరికట్టడం, పోలింగ్ నిలిచిపోయిన కేంద్రాల్లో అదనపు సమయం, అవసరమైన పోలింగ్ కేంద్రాల వద్ద మరింత పోలీసు బందోబస్తుల ఏర్పాటు కోసం కమాండ్ కంట్రోల్ సభ్యులు రాష్ట్ర, జిల్లా, నియోజక వర్గ స్థాయి పోలింగ్ అధికారులతో పోలీసులతో అనునిత్యం చర్చలు జరిపారు. పోలింగ్ కేంద్రాల్లో టిడిపి కార్యకర్తలు ఎదుర్కొన్న ఇబ్బందులను నియోజకవర్గ ఎఆర్ఓలకు, జిల్లా ఎన్నికల ఫిర్యాదు కేంద్రానికి ఎప్పటికప్పుడు సమాచారం అందించారు.

ప్రకాశం జిల్లా కమాండ్ కంట్రోల్ సెంటర్ కమిటీ సభ్యులుగా ప్రకాశం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, జిల్లా ప్రజా పరిషత్ మాజీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర రైతు అధ్యక్షులు మర్రెడ్డి శ్రీనివాసుల రెడ్డి, ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వై.వి సుబ్బారావు, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మొగల్ కాలేషా బేగ్, టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శి డాక్టర్ పసుపులేటి పాపారావు, కనిగిరి నియోజకవర్గ మాజీ ఎంపీపీ బేరీ పుల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

రేపల్లెలో ప్రశాంతంగా పోలింగ్

విశాలాంధ్ర - రేపల్లె : సార్వత్రిక ఎన్నికలు రేపల్లె నియోజకవర్గంలో సోమవారం ప్రశాంతంగా జరిగింది. అసెంబ్లీ పార్లమెంట్ అభ్యర్థుల ఎన్నికలకు సంబంధించి ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన పోలింగ్ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించడంతో పోలింగ్ కేంద్రాలు సమీపంలో రాజకీయ పార్టీలకు సంబంధించిన వ్యక్తులను కార్యకర్తలను నాయకులను ఎక్కువ మంది గుమికూడకుండా పోలీసులు ఎప్పటికప్పుడు పంపించి వేయడంతో పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి సంఘటనలు ఘర్షణలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. రేపల్లె డిఎస్పి టి.మురళీకృష్ణ సిఐలు మల్లికార్జున రావు నజీర్ బేగ్‌ల ఆధ్వర్యంలో సుమారు 900 మంది పోలీసులను హోంగార్డులను ఎన్ సీసీ విద్యార్థులను బందోబస్తులో విధులకు డ్యూటీలు వేసినట్లు తెలిపారు. పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో ముస్లిం మహిళలు అనారోగ్య బాధితులు దివ్యాంగులు మూడు చక్రాలు వాహనాల్లో వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం నుండి ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు క్యూ లైన్‌లో నిలబడి ఓటు హక్కు వినియోగించుకునేందుకు ముందుకు వచ్చారు. ఎండ వేడిమి సైతం లెక్కచేయకుండా వృద్ధులు మహిళలు పురుషులు ఓటు ఉన్న 18 సంవత్స రాలు పైబడిన కొత్తగా ఓటు హక్కు పొందిన ఓటర్లు సాఫ్ట్వేర్ ఉద్యోగులు హైదరాబాదు బెంగ ళూరు మద్రాసు విశాఖపట్నం నుండి రేపల్లెకు తరలివచ్చి ముందుగానే తమ తమ పోలింగ్ కేంద్రాల్లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం కొంత మందకొడిగా సాగిన ఓటర్ల పోలింగ్ మధ్యాహ్నం 3 గంటలకు సుమారు 60 శాతం వరకు ఓట్లు పోలు అయినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారులు తెలిపారు. మధ్యాహ్న వేళలో ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కొద్దిసేపు కురవడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది వెంటనే విద్యుత్ శాఖ సిబ్బంది అప్రమత్తమై విద్యుత్తును పునరుద్ధరించడంతో పోలింగ్ యధావిధిగా కొనసాగింది. పోలింగ్‌కేంద్రాల వద్ద ఎప్పటికప్పుడు పరిస్థితులను రేపల్లె అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి రేపల్లె రెవెన్యూ డివిజన్ అధికారి హేలా షారోన్ ఎప్పటికప్పుడు సందర్శించి పోలింగ్ సరళిని రెవిన్యూ పోలీస్ అధికారులతో సమీక్షించారు. మొత్తం నియోజక వర్గంలో 2,22,247 లక్షలకు గాను 1,68,469 కోట్లు పోలైయ్యాయని తెలిపారు. నియోజక వర్గంలో 74.1%ఓట్లు పోలైనట్లు రేపల్లె నియోజక వర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్డిఓ హేలా షారోన్ తెలిపారు. నియోజవర్గంలో ప్రశాంతంగా ఎన్నికల పోలింగ్ ముగిసినట్లు ఆమె తెలిపారు.

యద్దనపూడిలో ఆలస్యంగా ప్రారంభమైన పోలింగ్

విశాలాంధ్ర - యద్దనపూడి : పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు యద్దనపూడి మండలంలో చింతపల్లిపాడు యనమదల,యద్దనపూడి జాగర్లమూడి గ్రామాలలోని పోలింగ్ బూత్ లను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. మండలంలో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. ఆరు దాటిన తర్వాత కూడా యద్దనపూడి, గన్నవరం గ్రామాల్లో పోలింగ్ బూతులు వద్ద ఓటు వేసేందుకు ఓటర్లు బారులు తీరారు. 6 గంటల సమయానికి 85 శాతం పోలింగ్ నమోదైంది. గన్నవరం గ్రామంలో 94 శాతం నమోదైంది. ప్రారంభంలో చిమటవారిపాలెంలో సాంకేతిక లోపం వల్ల ప్రారంభంలో ఈవీఎంలు మొరాయించడం వలన ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైనది. పోలింగ్ ప్రారంభానికి ముందే మహిళా ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు .

నందిపాలెంలో ఘర్షణ

విశాలాంధ్ర - పొదిలి : పొదిలి మండలంలోని నందిపాలెం గ్రామంలో సోమవారం పోలింగ్ బూత్ వద్ద జరిగిన స్వల్ప వివాదం నెలకొంది. వైసిపి టిడిపి వర్గీయుల మధ్య ఘర్షణకు దారి తీసింది. పొదిలి ఎస్సై జి.కోటయ్య తెలిపిన వివరాలు మేరకు పోలింగ్ కేంద్రం వద్ద భారీగా గుమికూడిన ఓటర్లను అదుపు చేసే ప్రయత్నంలో భాగంగా టిడిపి వైసిపి వర్గీల మధ్య జరిగిన స్వల్ప వివాదం ఘర్షణకు దారి తీసింది అన్నారు. ఈ ఘర్షణలో ముగ్గురు టిడిపి కార్యకర్తలకు స్వల్ప గాయాలయ్యాయి అన్నారు. వివాదం విషయం తెలిసి అక్కడికి చేరుకున్న కందుల నారాయణరెడ్డి కుమారుడు విగ్నేష్ రెడ్డి వాహనంపై రాళ్ల దాడి జరగడంతో స్కార్పియో వాహనం అద్దాలు ధ్వంసం అయ్యాయని వివరించారు.

కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు. కాగా గాయాలైన ముగ్గురు టిడిపి కార్యకర్తలను పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందించారు. వారిని మార్కాపురం టిడిపి అభ్యర్థి కందుల నారాయణ రెడ్డి వైద్యశాలలో పరామర్శించారు.

దర్శిలో 117, 118 బూత్‌ల వద్ద స్వల్ప ఉద్రిక్తత

విశాలాంధ్ర - దర్శి: దర్శి నగర పంచాయితీ పరిధిలోని 117,118 బూతుల పరిశీలనకు టిడిపి అభ్యర్థి గోట్టిపాటి లక్ష్మి రావడంతో వైసీపీ అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి వర్గీయులు అందోళనతో స్వల్ప వివాదం చోటు చేసుకుంది. 6 గంటల తరువాత సమయం మించిపోయింది. మీరు లోపలికి వచ్చేందు వీలు లేదని అడ్డుకున్నారు. అనంతరం పోలీసుల జోక్యంతో సమస్య సద్దు మణిగింది.

శతకోడులో ఇరువర్గాల మధ్య ఘర్షణ

ముగ్గురు వైసీపీ కార్యకర్తలకు గాయాలు

విశాలాంధ్ర - పుల్లలచెరువు : సోమవారం జరిగిన శాసనసభ ఎన్నికల పోలింగ్ సందర్భంగా మండలంలో చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కొన్ని గ్రామాలలో తోపులాటలు, రాళ్లు రువ్వుకోవడం లాంటి చెదురు మదురు సంఘటనలు జరిగాయి. మండలంలోని గంగవరంలో వైసిపి వాళ్లు బూత్‌లలో ఓటర్లకు నగదు ఇస్తున్నారంటూ టిడిపి నాయకులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా టిడిపి, వైసిపి వర్గాల మధ్య తోపులాట జరిగింది. మండలంలోని శతకోడు గ్రామంలో ఓట్లు వేసి క్రమంలో టిడిపి, వైసిపి వర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. టిడిపి వాళ్ళు రాళ్లు రువ్వుకోవడంతో వైసిపి కార్యకర్తలకు గాయాలయ్యాయి. గ్రామానికి చెందిన కె.కృష్ణ, నగరి. బొర్రయ్య, మరియమ్మలకు గాయాలయ్యాయి. పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమనిగింది.

వెల్లివిరిసిన ప్రజాస్వామ్య చైతన్యం

విశాలాంధ్ర - అద్దంకి : సార్వత్రిక ఎన్నికల్లో అద్దంకి నియోజకవర్గ ఓటర్ల చైతన్యం వెల్లివిరిసింది. అన్ని మండలాల్లో ఓటర్లు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వామ్యులయ్యారు. నియోజకవర్గంలో సోమవారం జరిగిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగింది. సాయంత్రం 5 గంటల సమయానికి 71 శాతం పోలింగ్ నమోదు

అయింది. సాయంత్రం 6 గంటల సమయంలో కూడా పోలింగ్ బూత్ల వద్ద ఓట్లు వేసేందుకు ఓటర్లు పెద్ద ఎత్తున బారులు తీరారు. ముఖ్యంగా యువకులు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, మధ్యతరగతి ప్రజలు, మహిళలు ఓట్లు వేసేందుకు ఉత్సాహం కనబరిచారు. ఉమ్మడి కూటమి అద్దంకి నియోజకవర్గ అభ్యర్థి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ అద్దంకిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో అద్దంకిలో భారీ వర్షం కురవడంతో విద్యుత్తుకు అంతరాయం ఏర్పడి ఈవీఎంలు పనిచేయక కొద్దిసేపు పోలింగ్ నిలిచిపోయింది. పలు పోలింగ్ కేంద్రాల వద్ద కనీస వసతులు కూడా లేకపోవడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

ప్రధానంగా భవాని సెంటర్ రామయ్య పంతులు బడి పోలింగ్ బూత్ వద్ద, కాకాని పాలెం పోలింగ్ బూత్ వద్ద ఎన్టీఆర్ నగర్ వద్ద ఓటర్లు బారులు తీరి ఉన్నప్పటికీ టెంట్లు కూడా సరిపడా ఏర్పాటు చేయలేదు. దీంతో ఓటర్లు ఎండలో నిలుచుని తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. నియోజకవర్గంలో రాత్రి 10 గంటల వరకు పోలింగ్ జరిగే అవకాశం ఉంది.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన అభ్యర్థులు

విశాలాంధ్ర-పర్చూరు: పోలింగ్ కేంద్రాలను ప్రజా కూటమి అభ్యర్థి ఏలూరి సాంబశివరావు సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. వీరివెంట కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు. వైసీపీ అభ్యర్థి యడం బాలాజీ, ఎంపి అభ్యర్థి నందిగం సురేష్, టీడీపీ బాపట్ల అభ్యర్థి తెన్నేటి కృష్ణప్రసాద్, బీఎస్పీ, స్వతంత్ర అభ్యర్థులు పోలింగ్ కేంద్రాలను సందర్శించి, పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. పార్టీ నాయకులను కలిసి అధిక ఓటు నమోదు చేయాలని కోరారు.

వెలిగండ్లలో 74.53 శాతం పోలింగ్

విశాలాంధ్ర - వెలిగండ్ల : మండలంలో సోమవారం జరిగిన పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఉదయాన్నే ఏడు గంటలకు ఓటింగ్ ప్రారంభం కాగా మొగలూరు, తమ్మనేనిపల్లి తదితర పోలింగ్ బూతులలో ఈవీఎంలు మొరాయించటంతో ఓటర్లు కొంత అసహనానికి గురికాగా క్రమేన ఓటింగ్ శాతం సాయంత్రం 6 సమయానికి 73. 53% పోలింగ్ నమోదయింది. వెలిగండ్లలో మొత్తం ఓటర్లు 28,655 కాగా అందులో పురుషులు 14,677 గాను 10,831 మంది మహిళలు 13,975 ఓటర్లు ఉండగా 10,526 మంది తమ ఓటును ఆరు గంటలకు మొత్తంగా 21,637 వినియోగించుకున్నారు. గుడిపాటి పల్లి గ్రామంలో ఆరు గంటల సమయానికి క్యూలైన్లో ఓటు వేసేందుకు బార్లు తీరిఉన్నారు, మందకొడిగా పోలింగ్ సాగుతూ ఉండటంతో రాత్రి 9 గంటల దాకా జరిగే అవకాశం ఉంది.

బారులు తీరిన ఓటర్లు..

విశాలాంధ్ర-దొనకొండ: దొనకొండ మండలంలో సోమవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నా దృష్ట్యా ఓటర్లు ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రాలకు బారులు తీరారు. మండలంలో మొత్తం 37,488 మంది ఓటర్లు ఉండగా 47 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కొన్ని కేంద్రాల్లో సాంకేతిక సమస్యల కారణంగా ఈవియంలు మొరాయించినా తక్కువ సమయంలోనే సరిచేయటంతో ఓటర్లు ఓటు వేశారు. ఇరు పార్టీల ఆధ్వర్యంలో వాహనాలు ఏర్పాటు చేయటంతో మహిళలు, వృద్ధులు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామంటూ అధికారులు చెప్పినప్పటికి ఎక్కువ చోట్ల ఓటర్లు తీవ్ర ఎండలోనే నిల్చోవాల్సి వచ్చింది. తాగునీరు సరిపడక ఓటర్లు దాహంతో అల్లాడి పోయారు. మల్లంపేట, రుద్రసముద్రం, కొచ్చెర్లకోట, చందవరం, ఆరవల్లిపాడు, ఇండ్లచెరువు వంటి ఓటర్లు అధికంగా ఉన్న గ్రామాల్లో ఓటు వేసేందుకు ఓటర్లు క్రమ పద్ధతి లేక ఎగబడటంతో కొంత గందరగోళం ఏర్పడి సిబ్బంది కొద్దిసేపు పోలింగ్ నిలుపుదల చేశారు. ఎస్ఐ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది చొరవతో పరిస్థితి సద్దుమణిగి కొంత ఆలస్యంగా పోలింగ్ జరిగింది. ఎండ వేడిమికి మధ్యాహ్నా వేళ రాలేని ఓటర్లు సాయంత్రం 6 గంటలు దాటినా పెద్ద ఎత్తున బారులు తీరి కనిపించారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన శివప్రసాదరెడ్డి

వైసీపి ఎమ్మెల్యే అభ్యర్థి బూచేపల్లి శివప్రసాదరెడ్డి దొనకొండ పోలింగ్ కేంద్రాలలో జరుగుతున్న పోలింగ్ విధానంను పరిశీలించారు. ఎన్నికల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పారదర్శంగా పోలింగ్ జరిగేలా చూడాలంటూ అధికారులను కోరారు.

పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు

విశాలాంధ్ర-పీసీపల్లి : మండలంలో సోమవారం జరిగిన అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికలు పోలింగ్ ప్రశాంతంగా జరిగాయి. ఉదయం ఏడు గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైనప్పటికీ రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగించారు. ఈ పోలింగ్‌లో ప్రజలు ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. మండలంలో కొన్ని పోలింగ్ బూతుల వద్ద ఈవీఎంలు మొరాయించడంతో పలుచోట్ల ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఈవీఎంలు పనితీరు నిదానంగా ఉండడంతో ఓటు వేయడానికి చాలా సమయం

పడుతుందని ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు ఈసారి పోలింగ్ కేంద్రాల వద్ద వికలాంగులకు అసౌకర్యం కలగకుండా వీల్ చైర్లు ఏర్పాటు చేయడం విశేషం. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సిఆర్పిఎఫ్, పోలీస్ సిబ్బందితో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత చర్యలు చేపట్టారు. మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగియడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకున్నారు.

వెల్లివిరిసిన ఓటరు చైతన్యం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రాష్ట్రంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలలో ఓటరు చైతన్యం వెల్లివిరి సింది. చీరాల నియోజక వర్గంలో డెబ్బై శాతం వరకు ఓటింగ్ జరిగింది. ఉదయం 7 గంటల నుండే ఓట్లు వేయడానికి ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రతకు పోలింగ్ మందగించినా సాయంత్రం నాలుగు గంటల నుండి ఓటు హక్కు వినియోగం కోసం లైనుల్లో నిలబడ్డారు. ఆరు గంటల వరకు లైనులో ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు వేసే అవకాశాన్ని అధికారులు కల్పించారు. పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు వేసి, మంచి నీటి సౌకర్యం, ప్రాథమిక చికిత్సా కేంద్రం ఏర్పాటు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు విస్తృతబందోబస్తు నిర్వహించారు.

గవినివారిపాలెంలో ఉద్రిక్తత

మండలంలోని గవిని వారిపాలెంలో పోలింగ్ సమయంలో ఉద్రిక్తత నెలకొన్నది. వైకాపా, తెదేపా వర్గాల మధ్య బాహాబాహి జరిగింది. రాళ్లు, కర్రలతో పరస్పర దాడులు జరిగాయి. కూటమి అభ్యర్థి ఎం.ఎం. కొండయ్య ఆ ప్రాంతానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ఆ సమయంలో ఆయన కారుపై, యువ నాయకులు అమర్ నాథ్ కారుపై దాడి జరగడంతో కారు అద్దాలు పగిలిపోయాయి. పోలీసులతో కొండయ్య మాట్లాడుతూ దుండగులపై చర్యలకు డిమాండ్ చేశారు.

పోలీసులు వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. పోలీసులు తీవ్రంగా శ్రమించి పరిస్థితిని అదుపు చేశారు. తెదేపా జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు కొండయ్యను ఫోన్ లో పరామర్శిం చారు. దుండగులపై చర్యలకు డిమాండ్ చేశారు. ప్రతి ఒక్కరూ ఇటువంటి చర్యలకు భయపడకుండా ధైర్యంగా ఉండి ఓట్లు వేయించాలని అన్నారు.

స్వల్ప వివాదాలు మినహా పోలింగ్ ప్రశాంతం

75.56 శాతం పోలింగ్

విశాలాంధ్ర - మార్కాపురం : నియోజకవర్గంలో స్వల్ప వివాదాలు మినహా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతమైన వాతావరణంలో ముగిసిందని చెప్పవచ్చు. ఉదయం ఏడు గంటల నుంచే పోలింగ్ ప్రారంభం కావడంతో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకు నేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఉదయం పది గంటల సమయానికి 25 శాతం, మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి 35 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ సమయం ముగిసే సరికి 75.56 శాతం పోలింగ్‌శాతం నమోదైంది. నియోజకవర్గ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నా రాంబాబు ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి, ఎన్డీఏ కూటమి బలపరిచిన కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సయ్యద్ జావీద్ అన్వర్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ రవీంద్రనాథ్, నియోజకవర్గ సీపీఐ సెక్రటరీ అందె నాసరయ్య, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషీర్‌అలిబేగ్, మార్కాపురం ఎమ్మెల్యే, గిద్దలూరు ఎమ్మెల్యే అభ్యర్థి కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డిలు వారివారి పోలింగ్ కేంద్రాల్లో తమ ఓటు హక్కును

వినియోగించుకున్నారు. పట్టణంలోని వివేకానంద విద్యాపీటం, పొదిలి మండలంలోని నందిపాలెం గ్రామాలలో ఇరు పార్టీల మధ్య స్వల్ప వివాదాలు తలెత్తాయి. దీంతో ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు. నందిపాలెం గ్రామంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల నారాయణరెడ్డి కుమారుడు విష్ణుష్‌రెడ్డి వాహనంపై వైసీపీ కార్యకర్తలు దాడిచేసి అద్దాలు ధ్వంసం చేశారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరి ఇరువర్గాలకు నచ్చచెప్పి పంపించడం జరిగింది. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు పోలింగ్ మందకోడిగా సాగగా వాతావరణం కాస్త చల్లబడటంతో మళ్లీ వేగం పుంజుకుంది. ఏదేమైనప్పటికీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగియడంతో అటు రాజకీయ పార్టీల ప్రతినిథులు, పోలీసులు, ఇటు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

రోడ్డుపై బైటాయించిన గొట్టిపాటి

విశాలాంధ్ర-దర్శి : దర్శి మండలం బోట్లపాలెం, దేవవరంలో వైసీపీ గుండాల దాడికి నిరసనగా టిడిపి అభ్యర్థి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, సోదరుడు గొట్టిపాటి భరత్‌లు రోడ్డు పై బైటాయించి నిరసన తెలిపారు. వైసీపీ గుండాలు ఓటర్లను దాడి చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారికి పోలీసులు సహకరిస్తున్నారని ప్రజా స్వామ్య యుతంగా జరగడం లేదని అన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకొని పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించెందుకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వీరి వెంట నారపుశెట్టి పాపారావు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈవీఎంపై దాడి కేసు నమోదు

విశాలాంధ్ర-దర్శి : దర్శి మండల పరిషత్ కార్యాలంలో 132వ పోలింగ్ కేంద్రంలో ఈ.వీ.ఎం.ను విరగ కొట్టిన యువకునిపై క్రిమినల్ చర్యలకు కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. ఓటింగుకు ఎలాంటి ఇబ్బందీ కలగలేదని కలెక్టర్ వెల్లడించారు. తిరిగి పోలింగ్ కొనసాగింది. లైవ్ వెబ్ కాస్టింగ్ ద్వారా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

రేపల్లెలో ఈవీఎం మిషన్లు మొరాయింపు

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె నియోజకవర్గ పరిధిలోని ఇసుకపల్లి అయోవా బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల పోలింగ్ బూత్‌లో పోలింగ్ స్టేషన్ నెంబర్ 41లో ఉదయం 7 గంటలకి ప్రారంభిం చాల్సిన ఎన్నికలు ప్రారంభంలోనే ఈవీఎం మిషన్లు మొరాయించటంతో సుమారు అరగంట ఆలస్యంగా ఎన్నిక ప్రారంభమయ్యింది. సోమవారం ఉదయం 7 గంటల నుండి పోలింగ్ బూత్‌ల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఎట్టకేలకు ఈవీఎం మిషన్లు పనిచేయడంతో సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. అరగంట పైగా ఆలస్యం కావడంతో ఓటర్లు బారులు తీరారు. వేసిన టెంట్లు చాలక ఓటర్లు ఎండలో నిలబడి ఓర్పుగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వేమూరులో ప్రశాంతంగా పోలింగ్

విశాలాంధ్ర - వేమూరు: వేమూరు నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఓటర్లు ఉదయం నుంచి ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరారు. ఉదయం కొన్ని పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు మొరాయిం చినప్పటికీ తక్షణం పరిష్కరించి పోలింగ్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకు న్నారు. అక్కడక్కడ చిన్నచిన్న సంఘటనలు తప్ప ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కొల్లూరులో టిడిపి కార్యకర్తలు పోలింగ్ బూత్ ఎదురుగా ఓటర్లను ప్రభావితం చేస్తున్నారన్న ఉద్దేశంతో వైసీపీ అభ్యర్థి వరికూటి అశోక్ బాబు వారితో వాగ్వాదానికి దిగగా వైసీపీ టిడిపి శ్రేణులు నెట్టుకునే స్థాయికి వెళ్లారు. అనంతరం టిడిపి శ్రేణులు రాళ్లు రువ్వగా వైసీపీ అభ్యర్థి అశోక్ బాబు కాన్వాయ్‌లో ఉన్న కారు అద్దాలు పగిలాయి. అదేవిధంగా వేమూరు మండలం చావలి గ్రామంలో టిడిపి వైసిపి శ్రేణులకు జరిగిన ఘర్షణలో వైసీపీ కార్యకర్తకు తలకు గాయాలయ్యాయి. బలిజేపల్లి గ్రామంలో వైసీపీ టిడిపి శ్రేణుల మధ్య జరిగిన ఘర్షణలో వైసిపి పోలింగ్ ఏజెంట్‌కు తలకు గాయాలయ్యాయి. ఇటువంటి చెదురు మదురు సంఘటనలు తప్ప నియోజకవర్గ గ్రామాలలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. నియోజక వర్గంలో ఉదయం 9 గంటలకు 11.36 శాతం, 11 గంటలకు 26.94 శాతం, ఒంటిగంటకు 44.22 శాతం, సాయంత్రం ఐదు గంటలకు 71.56 శాతం, 6 గంటలకు 77.62 శాతం నమోదు కాగా 6 గంటల తర్వాత కూడా పోలింగ్ బూతులలో బార్లు తీరే ఉన్నారు. ఎన్నికలను వైసీపీ అభ్యర్థి అశోక్ బాబు, టిడిపి అభ్యర్థి నక్కా ఆనంద్ బాబులు పర్యవేక్షించారు. ఓటింగ్ నిలిచే సమయానికి 80 శాతం వరకు పోలింగ్ జరిగినట్లు తెలుస్తుంది.

కొండాయపాలెంలో ఘర్షణ

పలువురికి గాయాలు

విశాలాంధ్ర - బల్లికురవ : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా మండలంలో చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. కొన్ని గ్రామాలలో తోపులాటలు లాంటి చెదురు మదురు సంఘటనలు జరిగాయి. కొండయ్య పాలెం గ్రామంలో వైసిపి వర్గీయులపై టిడిపి వర్గీయులు దాడికి దిగడంతో కుంచపు శ్రీనివాసరావు, కుంచపు శివగంగతో పాటు పలువురికి గాయాలయ్యాయి. టిడిపి వారు దొంగ ఓట్లు వేయకుండా అడ్డుకున్నందుకు తమపై దాడి చేసి గాయపరిచారని వైసిపి వారు ఆరోపిస్తున్నారు. సుమారు 90 శాతం ఓట్లు పూర్తి అయిన తర్వాత తమపై కావాలని టిడిపి వారు దాడి చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. గాయపడ్డ వారిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. నక్కబొక్కలపాడు గ్రామంలో పోలింగ్‌సరళిని వైకాపా అభ్యర్థి పానెం చినహనిమిరెడ్డి పరిశీలించారు. మండల పరిధిలోని మొత్తం సుమారు 43 వేల మంది ఓటర్లు ఉన్నారు. మండలంలో సుమారు సాయంత్రం ఐదు గంటల వరకు 85శాతం ఓట్లు పోలయ్యాయి.

పోలింగ్ కేంద్రాల వద్ద పోలీస్ సిబ్బంది కొరత

విశాలాంధ్ర-టంగుటూరు : సార్వత్రిక ఎన్నికలలో భాగంగా టంగుటూరు మండలంలోని పద్దెనిమిది పంచాయితీలలో 49 వేల మంది ఓటర్లకు 63 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసింది. ఉదయం నుండే పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. మధ్యాహ్నం సమయానికే పోలింగ్ శాతం 50 శాతంగా నమోదయింది ఎన్నడూ లేని విధంగా పోలింగ్ శాతం అత్యధికంగా నమోదవడం అధికార ప్రతిపక్ష పార్టీలు ఊహించని రీతిలో ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ శాతం పెరగడం ప్రతిపక్ష పార్టీలు ప్రజా వ్యతిరేకత వల్లే ఓటింగ్ శాతం పెరిగిందని చెప్తుంటే అధికార పార్టీ తమ సంక్షేమ పథకాలు లబ్ధిదారులే ఓటింగ్ లో పాల్గొనడం వలన ఓటింగ్ శాతం పెరిగిందని అంచనా వేస్తున్నారు. సాయంత్రం 7 గంటల 30 నిమిషాల వరకు 75% వరకు పోలింగ్ జరిగిందని ఇంకా పూర్తిగా పోలింగ్ ముగియడానికి మూడు గంటల వరకు సమయం పడుతుందని అధికారులు తెలిపారు. మండలంలోని కొన్ని పోలింగ్ కేంద్రాల వద్ద స్వల్ప ఘటనలు చోటు చేసుకున్నాయి. టంగుటూరు మండలం కారుమంచి గ్రామంలోని 179 మరియు 180 పోలింగ్ బూత్ ల వద్ద వైసీపీ టిడిపి అభ్యర్థుల మధ్య వివాదం చోటు చేసుకుంది. దీంతో ఇరు వర్గాలు బాహాబాహికి దిగారు అయితే పోలింగ్ కేంద్రాల వద్ద తగినంత పోలీసు సిబ్బందిని పోలీస్ శాఖ ఏర్పాటు చేయలేకపోయింది. పోలీసు సిబ్బంది కొరత స్పష్టంగా కనిపిస్తుంది. మర్లపాడు గ్రామంలో అధికారుల లోపం వలన పోలింగ్ బూత్ లో ఎక్కువ మంది ఓటర్లు ఉండటంతో తెలుగుదేశం వైసిపి కార్యకర్తలు ఘర్షణ పడ్డారు. అధికారులు అదనంగా పోలింగ్ బూత్ ను ఏర్పాటు చేయకపోవడం వల్లనే ఈ ఘటనలు చోటు చేసుకుంటున్నాయని ప్రజలు ఆరోపించారు. కందులూరు లోని 176వ పోలింగ్ కేంద్రం వద్ద సాయంత్రం ఐదున్నర అయినప్పటికీ 300 మంది ఓటర్లు లైన్లో వేచి ఉన్నారు.

పోలింగ్ అధికారి ఓటర్లకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని సైగలు చేస్తున్నారంటూ ఓటర్లు ఆరోపిం చారు. అంతేకాకుండా ఓటు వేయడానికి ఎక్కువ సమయం పడుతూ ఉండటం పోలింగ్ అధికారి పనితీరు బాగాలేదని ఆరోపించారు. ఓటు హక్కు వినియోగించుకోవడానికి పలు రకాల ఇబ్బందులు తలెత్తడంతో పోలీసు అధికారులకు ఫోన్ చేసిన స్పందించడం లేదని వాపోయారు. కనీసం మంచినీళ్ళ సదుపాయం కూడా కల్పించలేదని ఆరోపించారు.

ఓటు వేసిన కలెక్టర్, ఎస్పీ

విశాలాంధ్ర - బాపట్ల : ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలని ఓటు వేయటం పౌరుని బాధ్యత అని జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా ఎస్పీ వకుల్‌జిందాల్‌లు తెలిపారు. బాపట్ల పట్టణంలోని మున్సిపల్ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద కలెక్టర్ రంజిత్‌బాషా, బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల పోలింగ్ బూత్‌లో ఎస్పీ వకుల్‌జిందాల్‌లు సోమవారం ఉదయం ఓటు వేశారు. అనంతరం పోలింగ్ కేంద్రాల వద్ద పరిస్థితిని పరిశీలించారు.

ఓటు వేయకుండా అడ్డుకోవటం దారుణం

విశాలాంధ్ర - నిజాంపట్నం : కొంత మంది కావాలని తమ టీడీపీ కార్యకర్తలు, టీడీపీ సానుభూతిపరులను ఓటింగ్ వేయనీకుండా అడ్డుకోవడం దారుణమని టీడీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మునాఫ్ అన్నారు. సోమవారం చినమట్లపూడి పోలింగ్ బూత్ సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రెడ్డపాలెం, ఎస్‌సి కాలనీ మధ్యలో పోలింగ్ బూత్ ఉండటం వల్ల తమను పోలింగ్‌కు రాకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. తమపై రాళ్లు విసిరి తమను భయ పెట్టాలని చూస్తున్నారని తమ కార్యకర్తలు సంయమనం పాటిస్తు న్నారని తెలిపారు. పోలింగ్ బూత్ నెంబర్ 157,158,159 బూతుల వద్దకు వచ్చి ఓటు వేయాల్సిన పరిస్థితిలకు ఉంది గతంలో దౌర్జన్యాలు చేసి తమకు అనుకూలంగా ఓట్లు వేసే పరిస్థితిలో కానీ ఇప్పుడు ప్రజలందరూ చైతన్యవంతులై తమ ఓటు హక్కును ఎవరికి వేయాలో వారే నిర్ణయించుకునే పరిస్థితిలో ఉన్నారు. కాబట్టి ఈ బూత్‌లను మార్చి ఎన్నికల సంఘం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీరయ్య షేక్ షాదుల్లా, షేక్ కరిముల్లా, యేమినేని రవీంద్ర, మహమ్మద్ ఫరూక్ టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన ఓటర్లు

విశాలాంధ్ర - పొదిలి : మండలంలో సోమవారానాడు జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ స్వల్ప వివాదం మినహా ప్రశాంతంగా ఎన్నికల ముగిశాయి. మండలంలోని నంది పాలెం గ్రామంలో పోలింగ్ కేంద్రం వద్ద జరిగిన చిన్నపాటి వివాదం ఘర్షణకు ముగ్గురు టిడిపి కార్యకర్తలుగా స్వల్ప గాయాలయ్యాయి. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న కందుల నారాయణరెడ్డి కుమారుడు విగ్నేష్‌రెడ్డి వాహనంపై వైసిపి వర్గీయులు రాళ్లతో దాడి చేయగా వాహనం దెబ్బతింది. కాగా మొత్తంగా పోలింగ్ ప్రశాంతంగా ముగి సింది. సాయంత్రం 6 గంటల సమయానికి పాములపాడు గొల్లపల్లి కుంచేపల్లి మరి కొన్ని గ్రామాల్లో పోలింగ్ కొనసాగుతూ ఉంది. ఉదయం 6 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్దకు బారులు తీరిన ఓటర్లకు తెల్లవారుజామున కురిసిన భారీ వర్షం కొంత ఆటంకం కలిగించింది. తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో మండలంలో కురిసిన భారీ వర్షం పోలింగ్ కేంద్రాల పరిసరాలు జలమయమైయ్యాయి. పొదిలి నగర పంచాయితీ పరిధిలోని కాటూరి వారి పాలెం 239 పోలింగ్ కేంద్రంలో ఉదయం మాక్ పోలింగ్ సందర్భంగా ఈవీఎం మొరాయించడంతో ప్రత్యామ్నాయ ఏర్పాటు చేస్తున్న సిబ్బందికి ఆటంకాలు ఎదురై అరగంటకు పైగా ఆలస్యంగా ప్రారంభమైంది. పొదిలి పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలలో వర్షపు నీరు నిండిపోవడంతో ప్రజలు పోలింగ్ కేంద్రాల వద్ద ముందుగా వచ్చినప్పటికీ ఓటు వినియోగించుకోవడంలో ఆలస్యం జరిగింది. మొత్తంగా సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు వచ్చిన వారికి స్లిప్పులు పంపిణీ చేసి ఓట్లు వేసేందుకు అధికారులు ఏర్పాటు చేశారు.

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈసారి సాధారణ ఎన్నికలకు ఉదయం 6 గంటలకే పోలింగ్ కేంద్రాల వద్దకు బారులు తీరారు. గత రెండు రోజులుగా ఇతర ప్రాంతాల్లో ఉన్నటువంటి ఓటర్లు వారి వారి స్వగ్రామాలకు చేరుకొని ఎన్నికల పోలింగ్ లో పాల్గొన్నారు. పొదిలి పట్టణంతో పాటు గ్రామాలలో భారీగా పోలింగ్ నమోదయింది. మండలంలోని మొదటి పోలింగ్ కేంద్రం 192 ఈగల పాడులో మొత్తం 980 ఓట్లకు గాను 850 పోలయ్యాయి. పొదిలి పట్టణంలో పలు కేంద్రాల్లో కూడా 90% ఓట్లు నమోదు అయ్యాయి.

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ పర్యాయం స్థానిక సంస్థల ఎన్నికలతో పోటీపడి వలన ఓటర్లకు రాకపోకలకు ప్రయాణ చార్జీలు ఇవ్వడంతో పొదిలి పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలోని ఒక పోలింగ్ కేంద్రంలో 90 శాతం నమోదయింది. గ్రామాలలో ఈ పరిస్థితి ఇంకా పెరిగే అవకాశం ఉంది. అక్కచెరువులో పోలింగ్ ఆరు గంటల సమయానికి సుమారు 300 మంది లైన్‌లో ఉన్నారు. మల్లవరంలో 200 మంది, జువ్వలేరు ఇతర గ్రామాల్లో కూడా వందలాదిమంది ఓటర్లు ఓటు వేసేందుకు7.30 లకు కూడా లైన్లో ఉన్నారు. దీంతో మొత్తంగా 80% పైగా పోలింగ్ జరగవచ్చు అని అంచనా.

చీరాలలో బాహాబాహీ

- కర్రలతో దాడులు చేసుకున్న వైనం
- అభ్యర్థుల కార్లపై రాళ్ల దాడి

విశాలాంధ్ర - చీరాల : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా చీరాలలోని పలు చోట్ల ఆయా పార్టీల కార్యకర్తలు, నాయకులు బాహాబాహీకి దిగారు. కర్రలు, రాళ్లతో దాడుల చేసుకున్నారు. గవినివారిపాలెంలో వైఎస్ఆర్సీపీ నాయకులకు టీడీపి నాయకులకు బాహ బాహి జరిగింది. ఈ వివాదంలో టీడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మద్దులూరు మాలకొండయ్య కారు అద్దం పగిలింది. టీడిపి, వైఎస్ఆర్సీపీ వర్గీయులకు గాయాలయ్యాయి. సకాలంలో స్పందించిన పోలీసు అధికారులు వివాదాన్ని అణచివేసి పోలింగ్ ప్రశాంతంగా సాగేలా చేశారు. పేరాల అంబేద్కర్ విగ్రహం వద్ద వైఎస్ఆర్సీపీ కాంగ్రెస్ శ్రేణులు ఎదురుపడి వివాదం చెలరేగగా పోలీసులు కంట్రోల్ చేశారు. ఈ వివాదంలో మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ కారు అద్దాలు పగిలాయి. అక్కడక్కడ ఈవిఏంలు మొరయించగా ఎన్నికల అధికారులు సకాలంలో స్పందించి ఈవీఏంలు బాగు చేశారు. సాయంత్రం ఐదు గంటలు పూర్తయ్యే సరికి నియోజకవర్గంలో 62 శాతం ఓట్లు పోలయ్యాయి. ఇంకా బూత్లలోనే ఓటర్లు లైన్లో నిలుచున్నారు.

ఒంగోలులో ప్రశాంతంగా ఎన్నికలు

గణనీయంగా పెరిగిన ఓటింగ్ శాతం

ఓటు హక్కును వినియోగించుకున్న పలు పార్టీల అభ్యర్థులు, అధికారులు

పెరిగిన మహిళా, యువత ఓటింగ్

విశాలాంధ్ర - ఒంగోలు : ఒంగోలులో దాదాపుగా ప్రశాంతవాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ప్రజలు గణనీయంగా ఓటింగ్ సెంటర్లు వచ్చి బారులు తీరి ఓట్లు వేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఓటింగ్ శాతం పెరిగింది. ఓటింగ్ లో మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పెరిగిన ఓటింగ్ శాతం తమకు లాభిస్తుందని అన్ని రాజకీయ పార్టీలు విశ్లేసిస్తున్నాయి. పార్టీ అభ్యర్థులు అన్ని పోలింగ్ బూత్‌లలోకి వెళ్లి ఓటింగ్ సరళిని పరిశీలించారు. అయితే కొన్ని

ప్రాంతాలలో యువత అత్యుత్సాహం చూపేందుకు ప్రయత్నించినప్పటికీ పోలీసులు ఎటువంటి గొడవలకు తావులేకుండా పటిష్టంగా తమ డ్యూటీలు చేశారు.టిడిపి ఒంగోలు ఎంపి అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి దామచర్ల జనార్ధనరావులు తమ కుటుంబ సభ్యులతో కలిసి రామ్‌నగర్‌లోని మున్సిపల్ హైస్కూల్‌లో తమ ఓటు హక్కును వినియోగించుకోగా, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బాలినేని శ్రీనివాసుల రెడ్డి ,వారి కుటుంబ సభ్యులు, మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు, వారి కుటుంబ సభ్యులు స్థానిక లాయర్ పేటలోని ఎస్ఎస్ఎన్ జూనియర్ కాలేజీ ఆవరణంలో ఏర్పాటు చేసిన ఎన్నికల బూత్‌లలో తమ ఓటు

హక్కును వినియోగించుకు న్నారు. ఈ సందర్భంగా టిడిపి ఒంగోలు అసెంబ్లీ అభ్యర్థి దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ 5సార్లు ఎమ్మెల్యే అని చెప్పుకునే బాలినేని ఓటర్లతో ఎలా మెసలు కోవాలో కూడా తెలియదన్నారు. దొంగ ఓట్లు ఉన్నాయని అనుమానం వస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలో తప్ప ఓటర్ల ఇళ్లపైకి వెళ్లి దాడి చేయటం సబబు కాదన్నారు. పెరిగిన ఓటింగ్ శాతం చూస్తుంటే టిడిపి అత్యధిక మెజార్టీతో గెలబోతుం దని, ఇది శుభసూచకమన్నారు. ఈ కార్యక్రమంలో దామచర్ల వెంట జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ ఉన్నారు.

పలు చోట్ల ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

పర్చూరులో...

పర్చూరు నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ఉదయం 6 గంటలకే బారులు తీరారు. కొన్ని కేంద్రాలలో సాయంత్రం 6 గంటలకు సమయం ముగిసిన ఓటు హక్కును వినియోగించుకొనుటకు వరుసలో ఉన్నారు. వారికి మాత్రం అధికారులు సమయం కేటాయించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుటకు పోలీసు అధికారులు సిబ్బందితో విధులు నిర్వహించారు. ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద జరిగే ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. నియోజకవర్గ ఎన్నికల అధికారి గంధం రవీందర్ అధికారులు అప్రమత్తంగా ఉండేవిధంగా చర్యలు తీసుకున్నారు. అకాల వర్షంతో విద్యుత్‌కు అంతరాయం కలిగింది. జనరేటర్లను అధికారులు ఏర్పాట్లు చేశారు. కొన్ని కేంద్రాలలో చార్జింగ్ లైట్ వెలుగులో పోలింగ్‌ను నిర్వహించారు. నియోజకవర్గంలోని ఈవీఎంలను బాపట్లకు తరలిస్తారు. ఈవీఎంలు మండలంలోని ఉప్పుటూరు, పోతుకట్లలలో మొరాయించాయి. ఉప్పుటూరులో గంట తర్వాత ఈవీఎం పనిచేయటంతో ఓటింగ్ ప్రారంభమైనది. పోతుకట్లలలో ఈవీఎంను మార్చారు. పర్చూరు నియోజకవర్గంలో అధిక శాతం నమోదు అయినది.

ముండమూరులో...

మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. దర్శి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని మండలంలో 56పోలింగ్ బూతులు 23 0 34 పురుష ఓటర్లు, 22 5 90 మహిళల ఓటర్లు మొత్తం 45625 మంది ఓటర్లు ఉన్నారు. మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పూరి మెట్ల లో 255 పోలింగ్ బూతులో ఉదయం 10:30 పాటు ఈవీఎం మొరాయించడంతో ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. అనంతరం యధావిధిగా పోలింగ్ కొనసాగింది. తూర్పు కంభంపాడు, శంకరాపురం గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను దర్శి నియోజకవర్గ వైయస్సార్ సిపి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పరిశీలించారు. భీమవరం, ఉమామహేశ్వర పురం గ్రామాలలో పోలింగ్ కేంద్రాల వద్ద రెండు వర్గాల మధ్య కొద్దిసేపు ఘర్షణ వాతావరణం నెలకొంది. శంకరాపురం గ్రామంలో పోలింగ్ కేంద్రంలో కొద్దిసేపు ఈవీఎం మొరాయించింది. మండలంలో 56 పోలింగ్ బూతులు, 23034 మంది పురుష ఓటర్లు, 22 5 90 మంది మహిళా ఓటర్లు మొత్తం 45625 ఓటర్ల ఉన్నారు.

కొనకనమిట్లలో...

కొనకనమిట్ల మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది 75శాతం పోలింగ్ నమోదయినట్లు మండల తాసిల్దార్ ఎస్ కే సాజిదా, పోలింగ్ అధికారులు తెలిపారు. మండల

కేంద్రమైన కొనకనమిట్లలోని 165వ పోలింగ్ బూత్ కాట్రగుంట పంచాయతీలోని పేరారెడ్డిపల్లిలోని ఈవీఎంలు గంటకు పైగా మొరాయించ డంతో అక్కడ పోలింగ్ ఆలస్యంగాప్రారంభమైంది. అన్ని గ్రామాల్లో ఏడు గంటలకే ఓట్లు వేసేందుకు కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఈ సందర్భంగా ఎన్నికల సరళిని మండల తాసిల్దార్ ఎస్కే సాజిద పరిశీలించారు గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పొదిలి సీఐ మల్లికార్జున రావు ఎస్ఐ మాధవరావు సిబ్బందితో పోలింగ్ కేంద్రాలను సందర్శించి శాంతిభద్రతలను పర్యవేక్షించారు.

నాగులుప్పలపాడులో...

సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తొలుత పోలింగ్ మండలంలో మందకొడిగా సాగింది కొన్నిచోట్ల ఇవిఎంలు మొరాయించడంతో ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది 7గంటలకు పోలింగ్ ప్రారంభించవలసి ఉండగా అరగంట ఆలస్యంగా ప్రారంబించారు దాంతో పోలింగ్ మందగొడిగా సాగింది దాంతో ఓటర్లు లైన్లో నిలబడి ఎండ తీవ్రతకు పలుఇబ్బందులు ఎదుర్కొన్నారు ఒంటిగంటకు 25శాతం మాత్రమే పోలింగ్ జరిగింది ఆతరువాత పోలింగ్ ఊపు అందుకుంది కొన్నిచోట్ల రాత్రి 8గంటల వరకు పోలింగ్ కొనసాగింది ఉప్పుగుండూరులో 230 బూత్ ఇవిఎం మొరాయించడంలో అరగంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది మాచవరంలో 238 బుత్ లో ఇవిఎం మొరాయించడంలో కొద్దిసేపు పోలింగ్ ఆగింది ఆతరువాత రెడ్డిపై చేయడంతో పోలింగ్ సజావుగా సాగింది మాచవరంలో, నిడమానూరులో వృద్దులను తీసుకువెళ్ళే క్రమంలో ఇరుపార్టీల మధ్య స్వల్ప వివాదం చోటుచేసుకుంది అదేవిదంగా రాపర్లలో రిలీవ్ ఏజంట్ల విషయంలో ఇరుపార్టీల మధ్య కొద్దిసేపు స్వల్ప వివాదం చోటుచేసుకుంది. ఈనేపద్యంలో మండలంలోని వివిదగ్రామాల్లో ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది.

పామూరులో...

ఎండ తీవ్రత, వర్షం, విద్యుత్ అంతరాయం కారణంగా కొన్ని బూతులలో సాయంత్రం 7 గంటల తరువాత కూడా పోలింగ్ కొనసా గాగింది. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉదయం బారులు తీరినప్పటికీ రాను రాను ఎండ తీవ్రత వలన ఓటింగ్ సరళి మందగించింది. అప్పుడప్పుడు విద్యుత్ అంతరాయం ఏర్పడటంతో క్యూ లైన్‌లో ఉన్నవారు అసౌకర్యానికి గురి కావాల్సి వచ్చింది.

పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 275, 276, 277 బూతులలో క్యూలైను రోడ్డుమీదికి ఉండటంతో వృద్ధులు, పిల్లలతో ఉన్న మహిళలు కొంత అసౌకర్యానికి గురి అయ్యారు. సాయంత్రం ఐదు గంటలకు వర్షం ప్రారంభం రావడం ఐదు యాభై సమయంలో వర్షం తగ్గడం ఒక్కసారిగా క్యూలైన్ పెరగడంతో మండలంలోని బోట్ల గూడూర్, చిలంకూర్, పట్టణంలోని గోపాలపురం బూతులో 7 గంటల తర్వాత ఓటు హక్కు కల్పించినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. మండలంలోని 68 బూతులలో ఒకటి రెండు చోట్ల స్వల్ప ఘర్షణలు తప్ప ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతముగా ఎన్నికలు జరిగాయి.